# ఏకాత్మభావాన్ని, ఐకమత్యాన్ని పెంచుకోండి!

సర్వరూప ధరం శాంతం సర్వనామ ధరం శివం
సత్యం శివం సుందరం సత్యసాయి మహేశ్వరమ్

ప్రేమస్వరూపులారా! భారతదేశము మహా పవిత్రమైనటువంటి దేశము. ఈ దేశమునందు సహనమన్నదే మనకు చక్కదనము.

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి
ఘన సత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావముకంటెను మాన్యమెద్దీ
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె
ఔర ఏమందు భారతపాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఱుగలేదొ
అట్టులైనారు మన భారతీయులు నేడు

ఏనుగు తన బలము తానెఱుగదు కనుకనే, ఏమీ తెలియనటువంటి అమాయకుడు,

sri sathyasai vachanamrutam

విద్యాహీనుడు అయినటువంటి మావటికి లొంగిపోయి అతను కూర్చొమ్మంటే కూర్చుంటుంది, లేవమంటే లేస్తుంది. అటులనే భారతీయులు తమయొక్క భాగ్యమును, బలమును, న్యాయమును, ధర్మమును గుర్తించుకోలేక వాటిని ఆచరణలో నిరూపించలేకపోతున్నారు.

"నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః" అని వేదంలో చెప్పినట్లుగా, త్యాగముచేతనే అమృతత్వము సిద్ధిస్తుంది. కాని, అట్టి త్యాగనిరతి, ఐకమత్యము ఈనాడు భారతదేశములో లేకపోతున్నవి. అన్నీ ఉన్నవి. అన్ని సద్గుణములూ, అన్ని ధర్మములూ ఉన్నవి. కాని, ఐకమత్యము లేకపోవడంచేత అన్నీ వ్యర్థమైపోతున్నవి. కనుక, ఈనాడు మనము ఐకమత్యమును అభివృద్ధి గావించుకోవాలి. ఎందుకంటే, అందరిదీ ఒకే జాతి. అందరూ మానవులే! కాని, మానవులని పేరు పెట్టుకొని మానవతా గుణములు లేకుండా కేవలం మృగముల యొక్క గుణమును, జంతువులయొక్క గుణమును మనం అనుసరిస్తున్నాము. 'మనము మానవులము' అనే సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. ఎదుటివారి యొక్క బాధలు మన బాధలుగా చూసుకోవాలి. వారి కష్టములు మన కష్టములుగా భావించాలి. అందరితోనూ ఐకమత్యంగా ఉండాలి; అందరూ ఏకాత్మస్వరూపులనే భావాన్ని మనం దృఢంగా విశ్వసించాలి. మంచిచెడ్డలు యోచన చేసి, అందరిలో ఉన్న మంచిని స్వీకరించి, చెడ్డను విడిచి పెట్టాలి. మననుండి పుట్టినవే కదా అని అన్నింటినీ మనము తీసుకోవడానికి వీల్లేదు. అక్కడ విచారణా శక్తి అత్యవసరం. నేడు పెరుగు, అన్నము, మిఠాయి మొదలైన పదార్థములు భుజించాము. కాని, రేపటి దినం ఉదయానికి అది వేరే రూపంగా మారుతుంది. అది మననుంచి పుట్టినటువంటిదే అయినను దానిని విసర్జించాలి. అదేరీతిగా, సమాజంలో మంచిచెడ్డలను విచారించి మంచిని స్వీకరించాలి, చెడ్డను విసర్జించాలి. మనకు అపకారము చేసినవారికికూడను మనము ఉపకారమే చేయాలి.

**"ఉపకారికి నుపకారము**
**విపరీతము కాదు సేయ వివరింపంగన్**
**అపకారికి నుపకారము**

srisathyasaivachanamrutam

నెపమెన్నక సేయువాడె నేర్పరి ..."

మనకు అపకారం, అన్యాయం చేసినవారికికూడా మనం సహాయం చేయాలి. వారిపట్ల మనకు ఎప్పుడూ సదాలోచనలే ఉండాలి. "యద్భావం తద్భవతి." మన బుద్ధి మంచిగా ఉన్నప్పుడు మనం అన్నీ మంచి పనులే చేస్తాము. మామిడిపండు భుజిస్తే దోసకాయ త్రేపు వస్తుందా? రాదు, మామిడిపండు త్రేపే వస్తుంది. అట్లే, మన మనస్సులో మంచితనముంటే మనము మంచినే చూస్తాము. మనలో చెడ్డతనమే ఉంటున్నప్పుడు మనకు అంతా చెడ్డవే కనిపిస్తాయి.

**ముద్దేనహళ్ళిలో శ్రీ సత్యసాయి యూనివర్సిటీ కేంపస్**

బెంగళూరుకు దగ్గరగా ఉన్న ముద్దేనహళ్ళిలో సత్యసాయి కాలేజి ఉంటున్నది. వారి పరిస్థితిని పురస్కరించుకొని అనేకమంది వారికి సహాయం చేస్తూ వచ్చారు. క్లాసు రూమ్‌లు కట్టించారు; భజన హాలు కట్టించారు. కాని, ఆ కాలేజి ఒక యూనివర్సిటీకి సంబంధించినది కాదు. అక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసుకొని యూనివర్సిటీకి పోవాలంటే బెంగళూరుకు పోవాలి. కనుక, దానిని చూచినప్పుడు నాకొక మంచి తలంపు కలిగింది. ఇక్కడ మన యూనివర్సిటీ చూస్తే చాలా అందంగా, అందరినీ ఆకర్షించేటట్లుగా ఉంది. అలాంటిదే వారికికూడా అందిస్తే వారు ఎంతో ఆనందిస్తారు కదా! కనుక, ఆ ముద్దేనహళ్ళిలో సత్యసాయి యూనివర్సిటీ కేంపస్‌ను స్థాపించాలని నాకు సంకల్పం కలిగింది. నా సంకల్పం ఎప్పుడూ చెడేటటువంటిది కాదు, చలించేటటువంటిది కాదు. ఈనాడు చెప్పినాను కనుక, రేపటి దినమే దానికి సంబంధించిన పని ప్రారంభిస్తాను. అక్కడంతా గ్రామీణ ప్రాంతానికి చెందిన పిల్లలుంటున్నారు. వాళ్ళు డిగ్రీ చదవాలంటే ఏ టౌనుకో పోవాలి. వాళ్ళ చేతిలో డబ్బు ఉండదు. అందువలన చదువు విడిచిపెట్టి సేద్యము చేపడుతున్నారు. అదికూడను అవసరమే. అయితే, ఈ భౌతికమైన చదువు భౌతికమైన జీవితానికి సహాయం చేస్తుంది. చదువుకున్న తరువాత వాళ్ళు వెళ్ళి ఏపనైనా చేసుకోవచ్చును. చదువుకొని ఉద్యోగం చేసుకుంటే, వాళ్ళకు కొంత డబ్బుకూడా చిక్కుతుంది. కనుక, ముద్దేనహళ్ళిలో మన యూనివర్సిటీ కేంపస్‌ను పెట్టి వాళ్ళకు మంచి చదువు అందించాలని నేను సంకల్పించుకున్నాను. దీంట్లో భాగవతము, భగవద్గీత, రామాయణము ఈ మూడింటినీ

srisathyasaivachanamrutam

బోధించడానికి ఒక క్లాసు పెట్టాలి. ఈ మూడింటినీ గ్రామాలలో ప్రచారం చేయవచ్చును. దానికి మంచి ట్రైనింగు ఇవ్వాలి. ఆధ్యాత్మికం లేకపోతే అన్ని చదువులూ అనవసరమే!

ప్రపంచంలో చదువుకున్నవారు ఎన్ని కోట్లమందో ఉన్నారు. కాని, ఏమి చేస్తున్నారు వాళ్ళు? సొసైటీకి ఏమైనా సహాయం చేస్తున్నారా? ఏమీ చేయడం లేదు. సొసైటీ మొహంకూడా చూడటం లేదు! 'టౌన్ లైఫ్' (పట్టణ జీవితం) మోజులో పడి క్లబ్బులు, జూదాలు ఇలాంటి చెడ్డ ప్రాక్టీసులకు అలవాటు పడిపోతున్నారు. వారిని చూసి పిల్లలుకూడను అదే మార్గములో ప్రయాణం చేస్తున్నారు. మొట్టమొదట పిల్లలను సరియైన మార్గములో పెట్టాలి. వారిని చూసి పెద్దలు కూడను సన్మార్గమునవలంబిస్తారు. ఈ ఉద్దేశముచేత నేను ముద్దేనహళ్ళిలో మన యూనివర్సిటీ కేంపస్ కట్టించాలని సంకల్పించుకున్నాను. రెండు, మూడు కోట్లు ఖర్చవుతుంది. అయినా ఫరవాలేదు. ఇది సద్వినియోగము, సత్ప్రవర్తన, సదాలోచన. ఇప్పుడు మనకు ప్రశాంతి నిలయంలో ఎటువంటి పిల్లలు చిక్కారు? అందరూ బంగారంవంటి పిల్లలు. ఏదో అంతో ఇంతో దోషము కలిగినప్పటికీ వాళ్ళు సవరించుకొని అడ్జస్టు చేసుకొనిపోతున్నారు. పిల్లలలో అలాంటి గుణములు రావాలి.

నిన్న మా పిల్లలు డ్రామా వేశారు. ఆ డ్రామా ఎంతో గొప్ప సందేశంతో కూడినటువంటిది. ఒక చిన్న పల్లెలో ఆస్తికోసం ఇద్దరు అన్నదమ్ములు జగడ మాడుతుంటారు. "నాయనా! మీరు ఈవిధంగా జగడమాడుతుంటే మన గ్రామాభివృద్ధి ఎట్లా సాధ్య మవుతుంది? మీరిద్దరూ ఐకమత్యంగా ఉండాలి" అని చెప్పి రాముణ్ణి, భరతుణ్ణి ఆదర్శంగా చూపెట్టి పెద్దలు వాళ్ళిద్దరినీ చక్కదిద్దుతారు. ఈవిధంగా పిల్లలతో గ్రామాభివృద్ధికోసం కొన్ని పనులు చేయించాలి. ఈనాడు స్టూడెంట్సు మంచివారైనప్పటికీ పెద్దలు వాళ్ళను పాడుచేస్తున్నారు. పెద్దలే పిల్లలను పెడమార్గం పట్టిస్తున్నారు. ఇప్పుడు పిల్లలే పెద్దవారికి బుద్ధి చెపుతున్నారు. తండ్రి కల్లు త్రాగుతుంటే, "నాన్నా! ఇలాంటి చెడ్డపనులు నీవు చేయకూడదు. దీనివల్ల నీవు మాకుకూడా చెడ్డ నేర్పించి నట్లవుతుంది. ఇది మంచిది కాదు" అని బోధిస్తున్నారు. పిల్లల ముందు పొగ త్రాగడం, కల్లు త్రాగడం ఇలాంటివి చేస్తుంటే, పిల్లలకుకూడా అదే అభ్యాసమవుతుంది. పెద్దలు పెడమార్గంలో పోతే

sri sathyasai vachanamrutam

వారిని చూసి పిల్లలుకూడా చెడిపోతారు. కాబట్టి, పిల్లలు బాగుపడాలంటే ముందు పెద్దలు బాగుపడాలి. ముద్దేనహళ్ళిలో పిల్లలకు పవిత్రమైన ఆదర్శాన్ని నిరూపించేటటువంటి యూనివర్సిటీ కేంపస్ కావాలి. అది ఒక కొండ ప్రాంతంలో ఉన్నది. పైచదువులు చదవటానికి పిల్లలు చిక్‌బళ్ళాపూరు పోవాలి, లేకపోతే బెంగళూరు పోవాలి. అంతటి శక్తిసామర్థ్యములు వారికి ఉండవు. సిటీలో జీవించడం ఆ పిల్లలకు చాలా కష్టమవుతుంది. వాళ్ళ తల్లిదండ్రులకుకూడను చాలా కష్టమే. కనుక, వాళ్ళకు అలాంటి కష్టములు లేకుండా ఉండాలని అన్ని సౌకర్యాలతోకూడిన హాస్టలు, అన్ని సబ్జెక్టులకు కావలసిన రూములు అన్నీ అక్కడే కట్టించి దానిని ఒక సంవత్సరంలోపలనే ఓపెన్ చేయాలని నిర్ణయించుకున్నాము. ఇది నా సత్యసంకల్పము.

**వేయి తల్లుల ప్రేమ సాయి ప్రేమ**

నన్నుగురించి అనిల్ కుమార్, 'పప్పెట్' (అజిత్ పొపట్) వీళ్ళందరూ ఎన్నియో విధములుగా చెపుతున్నారు. కాని, నన్నుగురించి చెప్పుకోవడంలో నాకు ఆనందము లేదు. నాకు అట్టి ఆశ ఏమాత్రమూ లేదు. నాకు గౌరవమూ లేదు, అగౌరవమూ లేదు; కోపమూ లేదు, తాపమూ లేదు. నాకు ఎప్పుడూ ఉన్నది ప్రేమ ఒక్కటే! నన్ను తిట్టినవారినికూడా నేను ప్రేమిస్తాను. నాగురించి దుష్ప్రచారము చేసినవారిని కూడా నేను ప్రేమిస్తాను. నేనెవ్వరినీ విరోధులుగా భావించను. అందరుకూడను నావారే! నేను మిమ్మల్ని కన్నబిడ్డలవలె చూసుకుంటున్నాను. నాది ఒక్క తల్లి ప్రేమ కాదు; సాయిప్రేమ వేయి తల్లుల ప్రేమ. అట్లు నేను మిమ్మల్ని ప్రేమించడంవల్లనే అన్నీ సవరించుకొని ముందుకుపోతున్నాను. ఎవరైనా ఏదైనా తప్పు చేసినప్పుడు, వారిని ప్రత్యేకంగా పిలిచి గట్టిగా చెపుతానుగాని, వారిని కోప్పడను. నాకు ఎప్పుడూ ఎవరిపైననూ కోపం లేదు. కోపతాపములు నాలో రానే రావు. కాని, అర్థం చేసుకోలేనివారు మరోవిధంగా భావిస్తారు. ఎవరు ఏవిధంగా భావించినప్పటికీ నాలో ఉన్నది ప్రేమ ఒక్కటే! నాది రాయల్ రోడ్డు, ఒకే మార్గము. మధ్యమధ్య అడ్డదార్లు ఏమాత్రము ఉండవు. కాని, నా మనస్సుయొక్క తత్త్వాన్ని కొందరు సరిగా గుర్తించడం లేదు. గుర్తించిన తరువాత వారే పశ్చాత్తాపపడతారు. ఆ పశ్చాత్తాపమే వారికి ప్రాయశ్చిత్తము. నాలో ఎట్టి భేదములూ రావు. "సమస్త లోకాః సుఖినో భవంతు" అందరూ ఆనందంగా

sri sathyasaivachanamrutam

ఉండాలి. పరస్పరం అనుకూలంగా ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలి, ఐశ్వర్యవంతులై ఉండాలి. అయితే, తమ ఐశ్వర్యాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండాలి. అదే నాకు ఆనందం. అట్టివారికి ఎంతైనా నేను అందిస్తాను. నేను ఎవ్వరినీ ఏమీ అడగటం లేదు. ఇంతవరకు నేను డబ్బు అడిగినవారు ఎవరైనా ఇంతమందిలో ఉంటే లేచి చెప్పండి. చూశారా! ఎవ్వరూ లేరు. నాకు కావలసినవి నాలోనుంచే వస్తుంటాయి. Money comes and goes, morality comes and grows. ఆ 'మొరాలిటీ'ని పెంచాలని నా ఉద్దేశ్యం. పల్లెపిల్లలను అభివృద్ధికి తెప్పించాలి. వాళ్ళకు ఈ చదువుతోపాటు భగవంతునిపై విశ్వాసంకూడా చాలా ముఖ్యం. ఆత్మవిశ్వాసం గలవారు దేనినైనా సాధించగలరు.

భద్రాచల రామదాసు ప్రజలనుండి వసూలు చేసిన ధనమునంతా రామునికే అర్పితం చేశాడు. కాని, తానీషా పెట్టిన బాధలను తాను భరించుకోలేక, **"కలికితురాయి నీకు పొలుపుగ జేయిస్తి రామచంద్ర! నీవు కులుకుచు తిరిగెదవు ఎవరబ్బ సొమ్మని రామచంద్ర!"** అని నిష్ఠూరంగా మాట్లాడాడు. తక్షణమే పశ్చాత్తాపపడి, రామునికి నమస్కరించి క్షమాపణ వేడుకున్నాడు. అదేవిధంగా, నాగురించి ఎవరైనా ఏమైనా అనుకుంటే అనుకుంటారు. "లోకో భిన్నరుచిః" లోకులు కాకులు. వాళ్ళవాళ్ళ భ్రమలకొద్దీ వాళ్ళు మాట్లాడుతూ ఉంటారు. కాని, నాకెట్టి భ్రమలూ లేవు. కనుక, ఎవరేమన్నను నేను వారిని ప్రేమతోనే పలుకరిస్తుంటాను. 'నీవు నన్ను ఇట్లంటివే' అని వారిని ఏమాత్రము దండించను. అది వాళ్ళే కనుక్కోవాలి. నన్నిప్పుడు ధిక్కరిస్తే మున్ముందు వాళ్ళు ఎంత బాధపడతారో! కనుక, ముందుగానే మీరు యోచించుకోవాలి. ముందుగా తెలుసుకుంటే, మున్ముందు మీకు బాధలు ఏమాత్రము అడ్డు రావు. నా మనస్సును ఇంతవరకు ఎవ్వరూ గుర్తించలేదు. గుర్తించినట్లుగా నటిస్తున్నారేగాని, ఎవ్వరూ కించిత్తైనా గుర్తించలేదు. బాహ్యంగా ఉన్నటువంటి విషయాలను మాత్రమే చూస్తున్నారు. బాహ్యంగా జరిగే పనులను మాత్రమే గుర్తిస్తున్నారుగాని, నా హృదయమునుండి పుట్టే పవిత్రమైన ప్రేమతత్త్వమును ఏమాత్రము అర్థం చేసుకోవడం లేదు. అయితే, ఏనాటికైనా గుర్తిస్తారు. అందరూ బాగుండాలి. అందరూ ప్రేమతో ఉండాలి. మనకు ఏ ఆస్తిపాస్తులు లేకపోయినప్పటికీ ప్రేమ అనే ఆస్తి ఒక్కటి ఉంటే, అన్నీ మనకు సక్రమంగా జరిగిపోతాయి. ఆ ప్రేమ ఆత్మవిశ్వాసముతో

sri sathyasai vachanamrutam

కూడినదిగా ఉండాలి.

అన్నింటికీ భగవంతుడు ఒక్కడే ఆధారం. మిగిలినవన్నీ భ్రాంతులే! కష్టములుగాని, నష్టములుగాని, దుఃఖములుగాని, రోగములుగాని ఏవి వచ్చినా 'అంతా భగవంతునియొక్క సంకల్పములే' అనుకోండి. అప్పుడు తప్పక మీకు అంతా బాగుంటుంది. 'ఇది నా దేహము' అంటున్నావు. మరి నీవెవరు? 'నా దేహము' అంటున్నావేగాని, 'దేహమే నేను' అనడం లేదు కదా! అట్లే, 'నా మనస్సు' అంటున్నావు. కనుక, మనస్సు వేరు, నువ్వు వేరు. నీ పేరేమిటి? అని అడిగినప్పుడు 'నా పేరు రాముడు', 'నా పేరు కృష్ణుడు' అని చెప్పకండి. 'ఐ యామ్ ఐ' (నేను నేనే) అని చెప్పండి. మీ పేరు మీ తల్లిదండ్రులు పెట్టినదేగాని, మీరు తెచ్చుకున్నది కాదు. ఏదికూడను మీరు తెచ్చుకున్నది లేదు. కాబట్టి, ఏదీ మీ ప్రోపర్టీ కాదు. 'నేను' అన్నదే మీ ప్రోపర్టీ. అందుకోసమే, ప్రతిదానికి 'నేను' అనే పదాన్ని మీరు ఉపయోగపెడుతున్నారు. "ఇది నా ఇల్లు", "వీరు నావారు" అనుకోవడంవల్ల అభిమానము ప్రారంభమవుతున్నది. దేహభావంతో 'నేను' అనుకోవడంవల్ల అహంకారం వచ్చేస్తుంది. 'నేను' అనే అహంకారము, 'నాది' అనే అభిమానము ఈ రెండూ తీసేస్తే నీవే భగవంతుడవు. అహంకారము, అభిమానము రెండూ లేకుండాపోతే నీవు నీవే! ఈ 'నేను, నాది' అనేవి లేకుండా మీ జీవితాన్ని జరుపుకున్నప్పుడు ఎంతైనా సంతోషాన్ని అనుభవిస్తారు. అందరూ చిరంజీవులై ప్రేమతో కలిసి మెలిసి జీవించండి.

**కలిసి మెలిసి పెరుగుదాం కలిసి మెలిసి తిరుగుదాం**
**కలిసి మెలిసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలిసి మెలిసి కలతలేక చెలిమితో జీవించుదాం**

ఒక్క వ్రేలుతో ఏ పనీ చేయలేము. అయిదు వ్రేళ్ళూ చేరినప్పుడే ఏ పని అయినా చేయవచ్చు. అట్లే, ఒకరికొకరికి మధ్య భేదములుంటే, ఏమాత్రము పని జరుగదు.

ఒకానొక సమయంలో ఐదు వ్రేళ్ళూ తమలో ఎవరు గొప్ప? అని వాదించుకున్నాయట. మధ్యలో ఉన్న వ్రేలు అహంకారంతో, "నేను మీ అందరికంటే పెద్దవాడిని. నాకు ఇటువైపున ఇద్దరు, అటువైపున ఇద్దరు 'బాడీ గార్డ్స్' ఉన్నారు. కాబట్టి, నేనే గొప్ప" అన్నదట. అప్పుడు

sri sathyasai vachanamrutam

చూపుడువ్రేలు "ఈ పని చేయాలని నేను చూపితేనే మీరు పని చేయగలరు. లేకపోతే పని చేయలేరు. కాబట్టి నేనే గొప్ప" అన్నదట. చిటికెన వ్రేలు, "నేను చిన్నగా ఉన్నానుగాని, ఎవరినైనా దండించాలంటే, ఎవరికైనా బుద్ధి చెప్పాలంటే నేనే సైన్యాధిపతిగా ముందు నిలుస్తున్నాను. కాబట్టి, నేనే గొప్ప" అన్నదట. అప్పుడు ఉంగరం వ్రేలు నవ్వుతూ "వజ్ర వైఢూర్యాలతో పొదగబడిన బంగారు ఉంగరాలు నాకే పెడతారు. కాబట్టి నేనే మీ అందరికీ రాజును" అని అన్నదట. ఇవన్నీ ఇలా వాదించుకుంటుంటే, బొటనవ్రేలు పెద్దగా నవ్వి, "నేను లేక మీరు ఏ పనీ చేయలేరు. కాబట్టి, మనం అందరం కలసి పని చేద్దాం" అన్నదట.

**ఈనాడు దేశమునకు కావలసింది ఐకమత్యమే!**

ఆస్తికులు, నాస్తికులు, ఆస్తిక నాస్తికులు, నాస్తిక ఆస్తికులు అందరూ ఏకం కావాలి. అదే ఇప్పుడు మనకు కావలసింది. ఈనాడు భారతదేశమునకు కావలసింది ఐకమత్యమే! మనలో ప్రేమ ఉన్నది, సత్యమున్నది, ధర్మమున్నది, న్యాయమున్నది; కాని, ఐకమత్యము లేదు. ఐకమత్యం లేకపోవడంచేతనే మనము ఇంత భిన్నత్వంతో జీవిస్తున్నాము. 'నీ బాధలు నా బాధలే!' అని ఒకరితో ఒకరు చేరి ఐకమత్యంగా జీవించాలి. ఈనాడు ఇంట్లో తండ్రీ కొడుకులకు మధ్య భేదమే! భార్యాభర్తలకు మధ్య భేదమే! కలసి ఉంటేనే కదా వాళ్ళిద్దరూ ఆనందంగా ఉండేది. ఏవో కొన్ని అభిప్రాయ భేదాలు రావచ్చు. కాని, అవి ఎప్పుడూ ఉండేవి కావు; వస్తుంటాయి, పోతుంటాయి. ఈ 'పాసింగ్ క్లౌడ్స్'ను పట్టుకొని మనము ఎందుకింత పోట్లాడుకోవడం! వీటిని ఏమాత్రము లెక్కచేయకూడదు.

నేనిప్పుడు ఇంత పని చేస్తున్నప్పటికీ ఎవ్వరినీ ఏదీ అడగటం లేదు. మద్రాసులో కోటిమందికి ఇంటింటికీ నీరిచ్చాను. కేవలం త్రాగడానికి మాత్రమే కాకుండా పంటలకుకూడా నీరందించాను. ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి జిల్లాల్లో కొండ ప్రాంతాలలో ఉన్నవారికి త్రాగునీరు లేకపోతే ఇప్పుడు వారందరికీ నేను గోదావరి నీళ్ళు అందించాను. కిందనుంచి పైకి నీటిని పంపు కొట్టించాను. మధ్యలో purify (శుద్ధి) చేయించాను. ఈవిధంగా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక మంచి చేయాలనే నా ఉద్దేశ్యం. ఇప్పుడు ముద్దేనహళ్ళి వాళ్ళకుకూడను సహాయం చేస్తున్నాను. ముద్దేనహళ్ళి పిల్లల అవస్థలను నా

sri sathyasai vachanamrutam

కళ్ళతో చూశాను. "మీరేమీ భయపడకండి, నేను మీకు సహాయం చేస్తాను. Why fear when I am near?" (మీచెంత నేనుండగా మీకు భయమెందుకు?) ఈవిధంగా చెప్పి వారికి ధైర్యమిచ్చాను. ముద్దేనహళ్ళివాళ్ళు ఇక్కడ ఎవరైనా ఉన్నారా? (ముద్దేనహళ్ళిలోని శ్రీ సత్యసాయి లోకసేవా ట్రస్టు సెక్రెటరీ శ్రీ నారాయణరావుగారిని వేదికమీదికి పిలిపించారు) ఇతను గొప్ప విద్యావంతుడు; అక్కడి స్కూలును చక్కగా నడిపిస్తున్నాడు. స్వామి అక్కడికి వెళ్ళినప్పుడల్లా 'స్వామీ! ఎప్పుడు మాపై మీకు దయ కలుగుతుంది?' అని ప్రార్థిస్తుంటాడు.

(స్వామి అనుమతితో శ్రీ నారాయణరావుగారు స్వామికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కొద్దిసేపు మాట్లాడిన తరువాత స్వామి ఆయనతో, "ఈపొద్దు నేను మీకిచ్చిన ఆనందాన్ని స్టేటుకంతా పంచండి. Be happy" అంటూ **రామ రామ రామ సీతా.....** అనే భజనతో తమ దివ్యోపన్యాసాన్ని ముగించారు)

**– తేదీ 23.11.2008, 83వ జన్మదినోత్సవం, సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasai vachanamrutam